సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం, 1, ఫిబ్రవరి, 2023



బద్దిపోచమ్మకు మొక్కులు

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం చెల్లించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం, కల్లుసాక సమర్పించారు.



ఘనంగా ఎల్లమ్మ సిద్దోగం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లిలోని మానేరు తీరాన కొలువుదీరిన ఎల్లమ్మ తల్లి సిద్దోగం మంగళవారం వైభవంగా జరిగింది. గౌడకులస్తులు మొక్కులు చెల్లించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/19.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ అఖిల్ మహాజన్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల):తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి తక్షణమే న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాల ప్రజలతో మమేకమై, వారి సమస్యలు తెలుసుకుని పైఅధికారులకు తెలపాలని సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి, జిల్లెల్ల చెక్‌పోస్టును తనిఖీ చేశారు. డీఎస్పీ విశ్వప్రసాద్, రూరల్ సీఐ బి.ఉపేందర్, ఎస్సై పి.లక్ష్మారెడ్డి ఉన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ వేములవాడ అర్బన్ మండల కార్యకర్తలతో మంగళవారం సమావేశం అయ్యారు. ముంపు గ్రామాల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పార్టీ ముందుకు వెళ్తోందన్నారు. పార్టీ వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ఆధ్వర్యంలో 11 గ్రామాలకు అధ్యక్షులను, సోషల్ మీడి యా మండల కో-ఆర్డినేటర్‌ను నియమించడం జరిగిందని తెలిపారు.బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, పండుగ ప్రదీప్, ప్రభాకర్‌రెడ్డి, ఆగయ్య, మల్లేశం, కత్తి కనుకయ్య పాల్గొన్నారు.

గల్ఫ్ పాలసీకి నిధులు కేటాయించాలి



ధర్నా చేస్తున్న గల్ఫ్ బాధితులు

ముస్తాబాద్(సిరిసిల్ల): రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ పాలసీకి ప్రత్యేక నిధులను బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేస్తూ గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో ముస్తాబాద్‌లో మంగళవారం ధర్నా చేపట్టారు. జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట ధర్మేందర్ మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. గల్ఫ్ బాధిత కుటుంబాల కోసం రూ.500 కోట్లు కేటాయించాలని,గల్ఫ్‌లో మృతి చెందినవారి కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని అన్నారు. గల్ఫ్ సంక్షేమ నిధికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈనెల 3వ తేదీ వరకు ఆందోళనలు చేపడతామని అన్నారు. ఎంపీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, గజ్జెల రాజు, జేఏసీ నాయకుడు కొండ భానుచందర్, చేపూరి శ్రీనివాస్ ఉన్నారు.

ప్రవేశాలకు ఆహ్వానం


తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం మండెపల్లి మోడల్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను 6వతరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ మేడిపల్లి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుండి 10 వరకు బ్యాక్‌లాగ్ సీట్లు భర్తీ చేసేందుకు పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఫిబ్రవరి 15లోపు దరఖాస్తు చేసుకోవాలని, జనరల్ విద్యార్థులకు రూ.20 , ఎస్సీ, ఎస్టీ, బీసీ పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్‌వారు రూ.125 ఫీజు చెల్లించాలని తెలిపారు. ఏప్రిల్ నెల 8న హాల్ టికెట్ డౌన్లోడ్, 16న పరీక్ష ఉంటుందన్నారు.

ట్రైబల్ డిగ్రీ ఉమెన్స్ కాలేజీలో..

తంగళ్లపల్లి: తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో 2023- 24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రజిని తెలిపారు. టీజీయూజీసెట్ ద్వారా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని, విద్యార్థినులు బీఎస్సీ(ఫిజికల్ సైన్స్), బీఎస్సీ(లైఫ్ సైన్స్), బీఏ, బీకాం(సీఏ) కోర్సుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుకు చివరి తేదీ ఫిబ్రవరి 15 అని వివరించారు.

3,938 మందికి కంటి పరీక్షలు

సిరిసిల్ల: జిల్లాలో మంగళవారం 3,938 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 834 మందికి రీడింగ్ అద్దాలను, 425 మందికి పాయింట్ గ్లాసులను అందించారు. జనవరి 19వ తేదీ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 30,366 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు వెల్లడించారు.



కేజీ టు పీజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మోడ్రన్ లైబ్రరీ



విద్యుత్‌దీపాల వెలుతురులో కేజీ టు పీజీ క్యాంపస్




ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

గంభీరావుపేటలో తొలి 'కేజీ టు పీజీ క్యాంపస్'

- నేడు మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

గంభీరావుపేట(సిరిసిల్ల): రాష్ట్రంలోనే తొలి కేజీ టు పీజీ క్యాంపస్ గంభీరావుపేట మండలకేంద్రంలో ప్రారంభానికి సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన ఊరు- మనబడి కార్యక్రమంలో భాగంగా మంత్రి కేటీఆర్ చొరవతో రహేజా ఫౌండేషన్ సహకారంతో కేజీ టు పీజీ క్యాంపస్ గంభీరావుపేటలో ఏర్పాటైంది. బుధవారం రాష్ట్ర మంత్రులు కే.తారకరామారావు, సబితా ఇంద్రారెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ చేతుల మీదుగా క్యాంపస్‌ను ప్రారంభించనున్నారు. పూర్వ ప్రాథమిక విద్య(అంగన్‌వాడీ) నుంచి పీజీ వరకు ఒకేచోట విద్యనందించే వీలుగా ప్రాంగణం రూపుదిద్దుకుంది. ఆరు ఎకరాల విస్తీర్ణంలో, 70తరగతి గదుల్లో 3500 మంది విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, ఊర్దూ మీడియంలో విద్యనభ్యసించేందుకు ఆధునిక హంగులతో ఎడ్యుకేషనల్ హబ్‌గా ఏర్పాటు చేశారు. డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం, వెయ్యి మంది విద్యార్థులు ఒకే చోట కూర్చొని తినే విధంగా డైనింగ్ హాల్, వంట గదులు ఉన్నాయి. 50 కంప్యూటర్లతో నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రం సిద్ధం చేస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్ కోర్టులు, అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ సభ ఏర్పాట్లను కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం పరిశీలించారు. క్యాంపస్‌లో పర్యటించి అధికారులతో సమీక్షించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సహకారం అందించిన ఏజెన్సీకి ప్రత్యేక కృజ్ఞతలు తెలిపారు. మనఊరు-మనబడి కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 172 ప్రభుత్వ పాఠశాలలను తొలి విడతగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. మోడల్‌స్కూల్స్‌గా ఎంపికచేసిన 26 ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, తహసీల్దార్ మధుసుదన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, గివ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పంట రక్షకులు



జిల్లెల్లలో ఎలుక కలుగును తవ్వుతున్న సంచార జీవి

- ఎలుకల వేట.. ఉపాధి బాట
- వలసజీవుల వైవిధ్య జీవనం
- గుంటూరు నుంచి వచ్చిన సంచారజీవులు



జబ్బకు ఎర్రటి సంచి, నెత్తికి టవల్ తలపాగ, చేతిలో కర్రతో ఉన్న ఇతని పేరు పోలయ్య(35). గుంటూరు జిల్లా చిలుకలూరిపేటకు చెందిన పోలయ్య సంచారజీవి. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో చెట్ల కింద గుడిసె వేసుకుని జీవిస్తున్నాడు. వరి పొలాల్లో కలుగులను గుర్తించి ఎలుకల నివారణకు మందు పెడతాడు. పంటలో ఎలుకల బెడదను తప్పించే బాధ్యత పోలయ్యది. ఒప్పందం ప్రకారం ఎకరానికి రూ.400 ఇస్తే.. ఐదు నెలలపాటు పంటను ఎలుకల బెడద నుంచి కాపాడుతాడు. పంటకు నష్టం జరుగకుండా చూడాల్సిన బాధ్యత ఇతనిదే. పంట చేతికి వచ్చిన తరువాత ఒప్పందం ప్రకారం ఆ డబ్బులు తీసుకుంటాడు. ఇలా ఒక్క పోలయ్యనే కాదు. ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, గంభీరావుపేట మండలాల్లో ఓ యాభై మంది వలసజీవులు వరి పంటను రక్షించే పనిలో ఉన్నారు.

సిరిసిల్ల: వరి పొలాల్లో ఎలుకలు ఉంటే పావు వంతు పంట వాటి పాలవుతుంది. పొలాల మధ్య ఒడ్లకు కలుగులు(రంధ్రాలు) చేసుకుని ఉండే ఎలుకలతో రైతులకు అపారనష్టం ఏర్పడుతుంది. జిల్లాలోని రైతులకు ఎలుకల నుంచి పంట నష్టం జరుగకుండా సంచారజీవులు బాధ్యత తీసుకుంటున్నారు. ఎలుకల నుంచి పంటను రక్షించినందుకు ఎకరానికి రూ.400 చొప్పున తీసుకుంటూ జీవితాన్ని గడుపుతున్నారు. ఎలుకల నుంచి వరిపంటను రక్షించడమే కాకుండా తమకు ఉపాధిబాటలు వేసుకుంటున్నారు.

పంట రక్షణ ఇలా..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాకు చెందిన సంచార జీవులు కొందరు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు గ్రామాలకు చేరుకున్నారు. ఇక్కడి రైతులతో ఒప్పందాలు సైతం చేసుకున్నారు. ఒడ్లకు ఉండే కలుగుల్లో నూకలు, ఉల్లిగడ్డలను పెడతారు. నూకలు, ఉల్లిగడ్డలను కలుగుల సంఖ్యను బట్టి రైతులే కొనివ్వాలి. ఇలా పంటకాలంలో ఎలకల నుంచి వలసజీవులు పొలాన్ని రక్షిస్తారు. పంటకాలం సుమారు 140 రోజుల్లో రెండుసార్లు మందు పెట్టి ఎలుకల బెడదను నివారిస్తారు. రైతులు తమ పంటను కోసిన ఎలుకల బాధ తప్పినట్లు గుర్తిస్తేనే ఎకరానికి రూ.400 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. రైతుల సమక్షంలోనే వారు శ్రమిస్తారు కాబట్టి అన్నదాతలు సైతం ఆ డబ్బులు ముట్టజెపుతున్నారు.

వ్యవ'సాయం'లో వలసజీవులు

జిల్లాకు వలస వచ్చిన సంచారజీవులు పంటను రక్షించే బాధ్యతలు తీసుకుంటున్నారు. చిన్నగుడారాలు వేసుకుని పంటకాలం ముగిసే వరకు ఇక్కడే ఉంటారు. తర్వాత స్వస్థలాలకు వెళ్తారు. మళ్లీ పంటల సీజన్‌లో ఇక్కడికి చేరుకుంటారు. ఇలా చాలా మంది రైతులు ఎలుకల నివారణ బాధ్యతలను వీరికి అప్పగిస్తుండడం విశేషం. ఓ యాభై వరకు సంచార జీవుల కుటుంబాలు జిల్లాలో బతుకుదెరువు సాగించడం విశేషం.

మా దగ్గర వరి ఉండదు



మా దగ్గర ఇలా వరి పంటను వేయరు. పత్తి, మిర్చి వంటి మెట్ట పంటలు వేస్తారు. అందుకే ఇలా వరి పంటను వేసే ప్రాంతాలకు వలస వచ్చి ఎలుకలను నివారిస్తూ.. బతుకుతున్నాం. ఎలుకల నివారణ మందును మేమే తయారుచేస్తాం. పంట పండిన తరువాతే రైతుల వద్ద డబ్బులు తీసుకుంటాం.

– వెంకటేశులు, సంచార జీవి

పది ఎకరాలు అప్పగించాను



మా ఊరిలో ఎలుకలను నివారించేందుకు గుంటూరు జిల్లాకు చెందిన సంచార కుటుంబాల వారు వచ్చారు. మా పొలం చూపించి నూకలు, ఉల్లిగడ్డలు ఇప్పించిన. పది ఎకరాల్లో ఎలుకల పొక్కలను గుర్తించి మందుపెట్టారు. పంట పండేలోగా మరోసారి మందుపెడతారు. ఎలుకల సమస్య పోతేనే వాళ్లకు రూ.4వేలు ఇవ్వాల్సి ఉంటుంది.

– పబ్బతి విజయేందర్‌రెడ్డి, రైతు, జిల్లెల్ల

మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు

- బీళ్లకు మళ్లుతున్న మల్లన్నసాగర్ ప్రాజెక్టు నీళ్లు
- రెండు మండలాల్లో 22వేల ఎకరాల ఆయకట్టు
- పూర్తయిన 46.6 కిలోమీటర్ల ప్రధాన కాలువ
- ఉప కాలువలకు 60 ఎకరాలు సేకరణ



మద్దికుంట, చీకోడు గ్రామాల మధ్య మల్లన్నసాగర్ కెనాల్

ముస్తాబాద్(సిరిసిల్ల): సముద్ర మట్టానికి 12,00 అడుగుల ఎత్తులో ఉన్న మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు తరలుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోనే కరువు సీమగా ఉన్న సిరిసిల్ల జిల్లా మెట్టప్రాంతానికి మల్లన్నసాగర్ ప్రాజెక్టు వరప్రదాయినిగా మారనుంది. జిల్లాకు గుండెకాయ వంటి ఎగువ మానేరు ప్రాజెక్టు చిన్న తరహా నీటి ప్రాజెక్టుగానే ఉండగా.. మల్లన్నసాగర్ లాంటి ప్రాజెక్టుతో వస్తున్న గోదావరి జలాలతో బీళ్లు పంటలతో కళకళలాడనున్నాయి. మల్లన్నసాగర్ ప్రాజెక్టు 12వ ప్యాకేజీ ద్వారా ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లో 22వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

రెండేళ్లుగా వస్తున్న జలాలు

- మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి దుబ్బాక మీదుగా మోహినికుంట, మద్దికుంట, చీకొడు, నామాపూర్ వరకు 46.6 కిలోమీటర్ల ప్రధాన కాలువ నిర్మించారు. రెండేళ్లుగా చీకోడు వరకు మల్లన్నసాగర్ ద్వారా గోదావరి జలాలు వస్తున్నాయి. గతేడాది చెరువులను ఈ నీటితోనే నింపారు.
- ఎండుతున్న వరిపంటలకు గోదావరి జలాలు జీవం పోశాయి. అన్నదాతలు సైతం అధిక దిగుబడులు సాధించారు. ఈ నేపథ్యంలో కెనాల్‌కు 80ఎకరాల భూమిని సేకరించి పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం 50 కిలోమీటర్ల ఉప కాలువల నిర్మాణాలకు 60 ఎకరాల భూసేకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.
- చీకొడు నుంచి మొర్రాయిపెల్ల, ముస్తాబాద్, వెంకట్రావుపల్లె, బందనకల్, మొర్రాపూర్ వరకు ఒక కెనాల్, ముచ్చర్ల, లింగన్నపేట, కొత్తపల్లి, దమ్మన్నపేట, నాగంపేట వైపు మరో కెనాల్ నిర్మించనున్నారు.
- ఈ కాలువల ద్వారా ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లోని 30 చెరువులకు మల్లన్నసాగర్ నీటిని సరఫరా చేయనున్నారు. ముస్తాబాద్‌లో 12వేల ఎకరాలకు, గంభీరావుపేట మండలంలో 10వేల ఎకరాలకు గోదావరి జలాలు రానున్నాయి.
- రాబోయే ఐదు నెలల్లో ఉప కాలువల నిర్మాణాలు పూర్తి చేసుకుని, వానకాలం పంటల నాటికి మల్లన్నసాగర్ ప్రాజెక్టు నీటిని అందించేందుకు ఇంజినీరింగ్ అధికారులు పనిచేస్తున్నారు.
- చీకొడు, మద్దికుంట, నామాపూర్‌లలో డిస్ట్రిబ్యూటరీలను ఏర్పాటు చేస్తున్నారు. ఉప కాలువల నిర్మాణానికి ఎకరానికి రూ.10.50 లక్షల పరిహారం ఇచ్చేందుకు సిద్ధం చేశారు.

బీడు భూములకు నీళ్లు వచ్చినై



ఎగువ మానేరు ప్రాజెక్టు కుడికాలువ మీదున్న ఆరు గ్రామాలలో బీడు భూములే ఉన్నాయి. మల్లన్నసాగర్ కెనాల్ కింద ఇప్పుడు బీడు భూములకు నీళ్లు వచ్చినై. సీఎం కేసీఆర్ కృషితో బీళ్లన్నీ పచ్చని పొలాలుగా మారనున్నాయి. రైతులకు కరెంట్, బోర్లతో పనిలేకుండా గోదావరి నీళ్లు వస్తున్నాయి.

– నడిమెల ఎల్లం, రైతు, మొర్రాయిపల్లె

నాలుగు నెలల్లో సబ్‌కెనాల్ పూర్తి



మల్లన్నసాగర్ ప్రాజెక్టు 12వ ప్యాకేజీ పనులు చివరి దశలో ఉన్నాయి. మెయిన్ కెనాల్ పనులు పూర్తి అయ్యాయి. ప్రస్తుతం ఉప కాలువల కోసం భూసేకరణ చేపట్టాం. వచ్చే నాలుగు నెలల్లో పనులు పూర్తిచేసి పంటలకు సాగునీరు విడుదల చేస్తాం. అందరి సహకారంతో ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తాం. – శ్రీనివాస్, డీఈఈ

రుణపడి ఉంటాం



గోదావరి జలాలతో మా ప్రాంతంలో బీడు భూములు సస్యశ్యామలం అవుతున్నాయి. ఏనాడు ఈ ప్రాంతానికి గోదావరి జలాలు వస్తాయని ఊహించలేదు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ఇక్కడి ప్రజలు రుణపడి ఉంటారు. మల్లన్నసాగర్ మెట్టప్రాంతానికి వరం లాంటింది.

– జనగామ శరత్‌రావు,ఎంపీపీ, ముస్తాబాద్

గ్రామ పంచాయతీలకు మహర్దశ

- జిల్లాలో 79 జీపీలకు కొత్త భవనాలు
- ఉపాధి హామీ ద్వారా రూ.15.80 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు



తంగళ్లపల్లి జీపీ భవనానికి భూమిపూజ(ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కొత్త పాలక వర్గాలు ఏర్పడిన నాలుగేళ్లకు గ్రామపంచాయతీలకు మహర్దశ పట్టింది. పాడుబడిన, ఇరుకు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న పంచాయతీలకు ఎట్టకేలకు కొత్త భవనాల నిర్మాణానికి ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం (ఎస్ఆర్‌ఈజీఎస్) ద్వారా నిధులు విడుదల చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇరుకు గదుల్లో నాలుగేళ్లుగా నరకయాతన పడుతూ రికార్డులను పెట్టడానికి స్థలం లేక పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది నానా తంటాలు పడ్డారు. కాగా మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో జిల్లాలో పలు గ్రామపంచాయతీలకు అన్ని సౌకర్యాలతో కూడిన పక్కా భవనాలు అందుబాటులోకి రానున్నాయి.

జిల్లాలో 79 గ్రామపంచాయతీలకు

జిల్లావ్యాప్తంగా 13 మండలాల్లో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పక్కా భవనాలు లేని, పాత భవనాల్లో కొనసాగుతున్న 79 జీపీలకు సొంత భవనాలు నిర్మించనున్నారు. మండలాల వారీగా చందుర్తి- 6, ఇల్లంతకుంట- 11, కోనరావుపేట- 15, రుద్రంగి- 4, వేములవాడ రూరల్-4, వేములవాడ అర్బన్-4, బోయినపల్లి- 11, గంభీరావుపేట-6, తంగళ్లపల్లి-13, వీర్నపల్లి-1, ఎల్లారెడ్డిపేట-4 చొప్పున గ్రామపంచాయతీలకు కొత్త భవనాలు మంజూరు అయ్యాయి.

రూ.15.80 కోట్ల నిధులు మంజూరు

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని ఒక్కో గ్రామపంచాయతీ భవనానికి రూ.20 లక్షల నిధుల చొప్పున రూ.15.80 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. 2022-23 ఫైనాన్షియల్ ఇయర్‌లో భాగంగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులను ఉపయోగించి గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించాలని సంబంధిత అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే మండలకేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీలకు రూ.20 లక్షల నిధులు మాత్రమే కేటాయించడంపై పాలకవర్గాలు పెదవి విరుస్తున్నారు. జిల్లాలోని బోయినిపల్లి, తంగళ్లపల్లి, కోనరావుపేట మేజర్ గ్రామపంచాయతీలకు రూ.కోటి చొప్పున నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

సంతోషంగా ఉంది



కొత్త గ్రామ పంచాయతీ పాలకవర్గాలు ఏర్పడి నాలుగేళ్లు గడిచింది. గ్రామపంచాయతీల భవన నిర్మాణానికి ఇప్పటికైనా నిధులు మంజూరు చేశారు సంతోషం.. ఏకగ్రీవ గ్రామాలకు ఇస్తామని హామీ ఇచ్చిన నిధులను కూడా ఇస్తే బాగుంటుంది.

– బైరినేని రాము, ఎంపీటీసీ, చిన్నలింగాపూర్

మోడల్ జీపీ నిర్మించాలి



భవన నిర్మాణానికి చొరవ చూపిన మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు.. మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీలలో మోడల్ గ్రామపంచాయతీ భవనాలను నిర్మించాలి. అందుకోసం అధిక నిధులు కేటాయించాలి.

– అంకారపు అనిత, సర్పంచ్, తంగళ్లపల్లి

వైజ్ఞానిక సదస్సులో జిల్లా విద్యార్థుల ప్రతిభ



అక్షయను అభినందిస్తున్న గుజరాత్ అధికారులు

ముస్తాబాద్: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరుగుతున్న జాతీయ వైజ్ఞానిక సదస్సులో ముస్తాబాద్ జెడ్పీ బాలికల పాఠశాల విద్యార్థిని దీటి అక్షయ ప్రతిభ చాటిందని హెచ్ఎం ఈసరి రవీందర్ తెలిపారు.30వ సైన్స్‌ఫెయిర్‌లో అక్షయ కాలుష్య గాలి నుంచి ప్రాణవాయువు ఉత్పత్తి ప్రాజెక్టు అంశంపై ఇచ్చిన ప్రదర్శనతో ప్రశంసలు అందుకుంది. అక్షయను గుజరాత్ రాష్ట్ర అధికారులు నరోత్తం సాహా, జేవీ నాడర్, సురేందర్ బెనర్జీలు అభినందించి, ప్రశంసాపత్రం, మెడల్ అందించారు. ఈ సందర్భంగా అక్షయను, ఫిజిక్స్ గైడ్ టీచర్ అహ్మద్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న వినీల

సౌత్ ఇండియా స్థాయిలో సిరిసిల్ల విద్యార్థిని

సిరిసిల్లఎడ్యుకేషన్: దక్షిణ భారతదేశ సైన్స్ ఫెయిర్ -2023లో గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జెడ్పీపాఠశాల విద్యార్థి వినీల తృతీయస్థానాన్ని దక్కించుకుందని డీఈవో రాధాకిషన్ తెలిపారు. గైడ్ టీచర్ తాడూరి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో తయారు చేసిన విమెన్ ఫ్రెండ్లీ యుటెన్సిల్ సపోర్టర్ అనే ఆవిష్కరణ మూడో బహుమతి గెలుచుకుందని వివరించారు. కేరళత్రిచూర్‌లజరిగిన దక్షిణ భారతదేశస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు 170 ఆవిష్కరణలు వచ్చాయి. దీంట్లో వినీల మూడోస్థానం సాధించి ప్రశంసాపత్రం జ్ఞాపిక అందుకుంది.

క్లుప్తంగా

కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు


హోటల్‌ను సందర్శిస్తున్న తోట ఆగయ్య.

రుద్రంగి(వేములవాడ): సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో దళితబంధు పథకంలో ఏర్పాటు చేసిన హోటల్‌ను సందర్శించి మాట్లాడారు. నిరుపేద దళిత యువకులకు దళిత బంధు పథకంలో వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేయించి వారి అభివృద్ధికి కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన వెంట సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఇసుక డంపులు సీజ్



తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామశివారు ఎల్లమ్మ గుడి ప్రాంతంలో ఇసుక డంపు చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం తనిఖీలు చేపట్టి ఇసుక డంపులను సీజ్ చేసినట్లు ఎస్సై పి.లక్ష్మారెడ్డి తెలిపారు. దాదాపు 25 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపును సీజ్‌చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం తుర్కపల్లి శివారులోని నక్కవాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు సోమవారం రాత్రి అడ్డుకున్నారు. ట్రాక్టర్లను గ్రామపంచాయతీకి తరలించి ట్రాక్టర్ల యజమానులను నిలదీశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హెడ్‌కానిస్టేబుల్ గంగయ్య ఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను సముదాయించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించాలని గ్రామస్తులు కోరారు.

తంగళ్లపల్లి ఇన్‌చార్జి ఎంపీవో సస్పెన్షన్

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీవోగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లును సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశ్వర్లు తన విధుల పట్ల అలసత్వం వహించడం, అటెండెన్స్ రిజిష్టర్, టూర్ డైరీ రిజిష్టర్ సరిగా నిర్వహించకపోవడం, అనధికారిక సెలవుపై వెళ్లడం వంటి అభియోగాలపై సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వులు పేర్కొన్నారు. కాగా ఈ ఉత్తర్వులు 23న జారీ కాగా మంగళవారం వెలుగులోకి వచ్చింది.

టెండర్ పొంది.. ఆనక వదిలి..

- పోటీ పడి టెండర్ దక్కించుకుంటున్న కాంట్రాక్టర్లు
- పలు కారణాలతో రద్దు చేసుకుంటున్న వైనం
- మళ్లీ టెండర్‌కు సిద్ధమవుతున్న ఆలయ అధికారులు


నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న అనుబంధ ఆలయంలో పలు పనుల కోసం పోటీ పడుతున్న కాంట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొని తీరా వచ్చాక వదిలేస్తున్నారు. భక్తులు మొక్కుల రూపంలో సమర్పించే కానుకలు, ఇతరత్రా వాటి టెండర్లకు లక్షలాది రూపాయలు డిపాజిట్లు చెల్లించి పోటీపడి టెండర్ దక్కించుకొని వదిలేస్తూ వెళ్లిపోతున్నారు. టెండర్‌లో నిబంధనల ప్రకారం పాడిన మొత్తంలో 50శాతం 15 రోజుల్లో చెల్లించాల్సి ఉండటంతో ఇందుకు ముందుకు రాకపోవడంతో అధికారులు కాంట్రాక్టును రద్దు చేస్తున్నారు. దీంతో ఆలయ అధికా రులు మళ్లీ టెండర్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

నాంపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..

నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నూనె గురుగుల కాంట్రాక్టు కోసం 2022 డిసెంబర్ 17న ఆలయ అధికారులు టెండర్ నిర్వహించారు. ఈ టెండర్ కాలపరిమితి రెండేళ్లు ఉంటుంది. సిద్ధార్థ్ అనే కాంట్రాక్టర్ రూ.8 లక్షలు డిపాజిట్ చెల్లించి రూ.1 కోటి 1,116 హక్కులు పొందారు. హక్కులు పొందిన దానిలో 50శాతం చెల్లించాల్సి ఉండగా ముందుకు రాక పోవడంతో డిపాజిట్ రూ.8లక్షలు ఫైనల్ నోటీసు అందించి రద్దు చేశారు. గతంలో ఈ టెండర్ రెండేళ్లగాను రూ.61.65 లక్షలు ఉండగా హెచ్చింపు చేసి మరీ దక్కించుకొని వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. టెండర్ నిబంధనలు పాటించని వారి పట్ల ఆలయ అధికారులు కఠినంగా వ్యవహరిస్తుండగా ముందస్తు అంచనా వేయడంలో విఫలమైన కాంట్రాక్టర్లు లక్షలాది రూపాయల డిపాజిట్లు సైతం వదిలించుకుంటున్నారు. మళ్లీ ఫిబ్రవరి 7న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఈనెల 7న మళ్లీ టెండర్



నాంపల్లి ఆలయంలో నూనె గురుకుల టెండర్ రద్దు చేశాం. మళ్లీ ఫిబ్రవరి 7న టెండర్ నిర్వహిస్తున్నాం. టెండర్ దక్కించుకున్న వారికి దేవా దా య కమిషనర్ ఆదేశాల మేరకు అందజేస్తాం.

–నరేందర్,నాంపల్లి ఆలయ ఇన్‌చార్జి

ఇచ్చిన హామీలు నెరవేర్చండి


మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్ సొంత నియోజకవర్గంలో ఇచ్చిన అభివృద్ధి పనుల హామీలు నెరవేర్చాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి అన్నారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్‌లో డిగ్రీ కళాశాలలు, ఇల్లంతకుంటలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు అంశాన్ని మరిచిపోయారని ఎద్దేవా చేశారు. ఎప్పుడు చూసినా కేంద్ర ప్రభుత్వంపై అసత్య ప్రచారం, విమర్శలు చేయడమే పనిపెట్టుకున్నారని విమర్శించారు. ముందు నియోజకవర్గం అభివృద్ధికి పూర్తిస్థాయి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, నాయకులు ఠాకూర్ రాజాసింగ్, బూర విష్ణు, కైలాష్, అంజన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా కబడ్డీ పోటీలకు సాయిప్రియ


సాయిప్రియ

కరీంనగర్‌స్పోర్ట్స్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు జరుగనున్న ఖేలో ఇండియా కబడ్డీ పోటీలకు కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న జి.సాయిప్రియ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం సాయిప్రియ హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఖేలో ఇండియా జట్టు శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతుంది. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీధర్‌రావుతో పాటు అరుణ, స్వరూప, వెంకటరమణ, సతీష్‌కుమార్ అభినందించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి


రామకిష్టయ్య మృతదేహం


రాయమల్లమ్మ మృతదేహం

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో రైతు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. పోతుగల్‌కు చెందిన రైతు పేర్మని రామకిష్టయ్య(55) మంగళవారం పొలం పనులకు వెళ్లాడు. భార్య లీలవ్వ పొలంలో కలువు తీస్తుండగా.. రామకిష్టయ్య వ్యవసాయ బావిలో నీళ్లు తగ్గాయో లేదో తెలుసుకునేందుకు వంగి చూశాడు. గట్టున కాలుజారి బావిలో ఉన్న సిమెంట్ గాజులపై పడ్డాడు. తలకు తీవ్ర గాయాలైన రామకిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. రామకిష్టయ్య కనిపించకపోవడంతో భార్య లీలవ్వ ఆయన కోసం వెతికింది. బావిలో భర్త మృతి చెంది ఉండడం గమనించి కన్నీరుమున్నీరై చుట్టుపక్కల రైతులను పిలిచింది. అప్పటి వరకు తమతో కలిసి పనిచేసిన భర్త నిర్జీవంగా కనిపించడంతో ఆమె రోదనలు మిన్నంటాయి. కుమార్తె, కుమారులు బాల్‌లక్ష్మి, దేవరాజు, శంకర్‌లు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ,,

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన పెంజర్ల రాయమల్లమ్మ (57) మంగళవారం విద్యుదాఘాతానికి గురై మరణించింది. స్థానికుల వివరాలు.. ఇంటి ఆవరణలో బావికి అమర్చిన విద్యుత్ మోటార్ వైరు ఊడిపోవడంతో విద్యుత్ సరఫరా అవుతున్న వైరుకు తాకగా, షాక్‌కు గురైన రాయమల్లమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త గతంలోనే మరణించగా బుద్ధిమాంద్యం గల కూతురు స్వరూప ఉంది.

మానవత్వం చాటిన సీఐ


కుమారుడు లడ్డుతో తల్లి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులైన తల్లికుమారులకు తక్షణ సాయం అందించి మానవత్వం చాటుకున్నారు ఎల్లారెడ్డిపేట సీఐ మొగిలి. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా గంభీరావుపేటకు వెళ్తున్న సీఐ మార్గమధ్యలో సోమారిపేటకు చెందిన శిరీష తన కుమారుడు లడ్డుతో కలిసి తమ బంధువు ద్విచక్ర వాహనంపై వెళ్తోంది. కుక్క అడ్డుగా రావడంతో వారి వాహనం అదుపు తప్పి కింద పడిపోయారు. దీంతో శిరీష ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన సీఐ వెంటనే తన వాహనంలో వారిని ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మానవత్వంతో సకాలంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన సీఐకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఉరేసుకొని ఆత్మహత్య


రాజు(ఫైల్)

చందుర్తి(వేములవాడ): భార్య కాపురానికి రావడం లేదని యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందుర్తి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తికి చెందిన అత్తెన రాజు(45) వేములవాడ సబ్ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. భార్య శైలజ కొన్నేళ్లుగా కాపురానికి రావడం లేదు. ఈ విషయమై పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీ జరిగినా సమస్య పరిష్కారం కాలేదు.కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజు తమ ఆవేదన ఇతరులతో పంచుకోలేక మనస్థాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య శైలజతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి అక్క రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి పోలీసులు తెలిపారు.

ఆముదాలపల్లిలో గీత కార్మికుడు..

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో మార్క తిరుపతి(58) అనే గీత కార్మికుడు అనారోగ్య బాధలు భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సుధాకర్ తెలిపారు. రెండేళ్ల క్రితం తిరుపతికి పక్షవాతం రావడంతో మందులు వాడుతున్నాడు. నయం కాకపోవడంతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పై కప్పునకు ఉరేసుకున్నాడు. కూలీ పనులకు వెళ్లిన భార్య భాగ్యలక్ష్మి ఇంటికి రాగా, ఇంట్లో తలుపులు వేసి గడియపెట్టి ఉంది. అనుమానంతో కిటికీలో నుంచి చూడడంతో దూలానికి వేలాడుతూ కనిపించాడు. చుట్టుపక్కల వారిని పిలిచి బలవంతంగా తలుపులు తెరిచి చూడగా మృతిచెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆర్‌వీఆర్ కంపెనీలో ప్రమాదం

- కార్మికుడికి తీవ్రగాయాలు


ప్రమాద దృశ్యం

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఆర్‌వీఆర్ ప్రైవేట్ ఓబీ కంపెనీలో ప్రమాదం జరిగి కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. సోమవారం రాత్రిషిఫ్ట్‌లో ముందుగా వెళ్తున్న వోల్వో వాహనాన్ని వెనకాలే వెళ్తున్న వాహనం ఢీకొనడంతో రాకేష్ అనే డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. రెండు వాహనాల మధ్య డ్రైవర్ ఇరుక్కోవడంతో కాలు మడమ భాగం వరకు కట్‌అయ్యింది. తీవ్ర రక్తస్రావం కావడంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాలు భాగం మడమ వరకు తొలగించే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.

కాపర్ వైర్ దొంగిలించిన వ్యక్తికి జైలు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణంలోని సన్ ఇంజినీర్ షాపు నుంచి కాపర్ వైరు దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయస్థాన న్యాయమూర్తి మంగళవారం తీర్పును వెలువరించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్ కుమార్ తెలిపారు. సిరిసిల్లకు చెందిన కంచం వేణు గతేడాది జూలై 30న దాదాపు 10 కిలోల కాపర్‌వైరు దొంగిలించాడన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి కోర్టులో సాక్ష్యాలను నిరూపించడంతో న్యాయమూర్తి శిక్ష ఖరారు చేసినట్లు తెలిపారు.

లచ్చయ్య మృతి తీరని లోటు


లచ్చన్న మృతదేహానికి నివాళి అర్పిస్తున్న కమ్యూనిస్టు నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కమ్యూనిస్టు నాయకుడు లచ్చయ్య మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని కమ్యూనిస్టు నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని చీర్లవంచలో అనారోగ్యంతో మృతి చెందిన జంగపల్లి లచ్చయ్య మృతదేహానికి నివాళి అర్పించి మాట్లాడారు. సీపీఐలో చురుకుగా పనిచేస్తూ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగించారని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల పక్షాన పోరాడాడని, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా సేవ చేశాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కార్యవర్గ సభ్యులు కడారి రాములు, పెల్లి మల్లేశం, కౌన్సిల్ సభ్యులు మంత్రి చంద్రన్న, మీసం లక్ష్మణ్, పిట్టల శ్రీనివాస్, పరుశురాములు, గంగురాజు, నర్సన్న, పరుశరాములు, అంతం రవి, చంద్రయ్య, మల్లేశం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ -4

- ప్రారంభించనున్న మంత్రి గంగుల కమలాకర్
- జూనియర్స్, సీనియర్స్ విభాగంలో మ్యాచ్‌లు

కరీంనగర్‌స్పోర్ట్స్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) సీజన్–4 ప్రారంభం కానుంది. తెలంగాణలోని ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జూనియర్, సీనియర్స్ కేటగిరీలలో క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో మ్యాచ్‌లు జరుగనుండగా, ఉదయం పోటీలను రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. కాగా ప్రతి రోజూ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు జరుగనున్నాయి. పోటీలకు హాజరయ్యే జట్లు ముందుగా నిర్వాహకులు సూచించిన షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలి. కరోనా దృష్ట్యా క్రీడాకారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ కోవిడ్ నిబంధనలు పాటించాలని నిర్వాహకులు తెలిపారు. కాగా ఎస్‌పీఎల్ సీజన్- 4కు సుధాకర్ పైప్స్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు.

నియమ నిబంధనలు..

- ఆయా కళాశాలల జట్లు తమ మ్యాచ్‌లు సూచించిన సమయానికి, మ్యాచ్ జరిగే తేదీన గంట ముందు నిర్వాహకులకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.
- మ్యాచ్ సమయంలో ఇరు జట్ల క్రీడాకారులు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు సంబంధించిన పదో తరగతి మార్కుల మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు చూపించాలి.
- క్రీడాకారులు సొంత కిట్‌ను వెంట తెచ్చుకోవాలి. మ్యాచ్‌లలో పాల్గొనే క్రీడాకారులు వైట్ డ్రెస్ తప్పనిసరిగా ధరించాలి. వైట్ డ్రెస్ లేనివారు మ్యాచ్‌లు ఆడేందుకు అనర్హులు.
- మ్యాచ్ జరిగే సమయంలో బ్యాట్స్‌మెన్, వికెట్ కీపర్ తప్పని సరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్‌గార్డ్స్, హ్యాండ్ గ్లౌజ్స్ ధరించాలి.
- ఒక కళాశాల జట్టు తరుపున ఆడి మళ్లీ ఇతర కళాశాలకు ఆడరాదు. అలా ఆడితే ఆ కళాశాల జట్టును టోర్నమెంట్ నుంచి తొలగించడం జరుగుతుంది.
- ఎస్‌పీఎల్ సీజన్–4కు సంబంధించిన తుది నిర్ణయం నిర్వాహకులదే.

అక్రమ వెంచర్లపై చర్యలేవి..?


మాట్లాడుతున్న చొక్కాల రాము

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణం, అర్బన్ మండలాల్లోని గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ వెంచర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము అన్నారు. మంగళవారం వేములవాడ నందికమాన్ వద్ద గల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వేములవాడ శివారులో లే అవుట్లు లేకుండా అక్రమ వెంచర్లు చేసి అమ్మకాలు జరుపుతున్నారని, పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వెంచర్ల పేరుతో ప్రభుత్వ భూములను కూడా కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిబంధనల ప్రకారం వెంచర్లు చేయాలని కోరుతున్నామని అన్నారు. అధికారులు అక్రమ వెంచర్లను గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాల యాజమాన్యంపై చర్య తీసుకోవాలి


డీఈవోతో వాగ్వాదం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బస్సు ప్రమాదానికి కారణమైన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించడానికి మంగళవారం వచ్చిన జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌తో వాగ్వాదానికి దిగారు. ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతున్నా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. స్కూల్ బస్సు సీటింగ్ కెపాటిసీ 30మంది ఉంటే 60 మంది తీసుకెళ్తున్నారని అన్నారు. కాలం చెల్లిన వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ప్రైవేటు పాఠశాల బస్సులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని లేనిపక్షంలో డీఈవో కార్యాలయంతో పాటు జిల్లా రవాణాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, సత్యంరెడ్డి, రామచంద్రరెడ్డి, జితేందర్‌రెడ్డి, స్వామి, హరికృష్ణ, సాయికుమార్, కిరణ్, ఎలెందర్, విజయ్ పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడిన ముగ్గురి అరెస్టు


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ మొగిలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురిని మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ మొగిలి తెలిపారు. బొప్పాపూర్ శివారులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ట్రాలీ ఆటోలో సెంట్రింగ్ రేకులు తీసుకెళ్తున్న గంభీరావుపేట మండలం జగదాంబతండాకు చెందిన ఇద్దరు యువకులు, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన వ్యక్తిపై అనుమానం వచ్చి విచారించామని అన్నారు. ఆటోలో తీసుకెళ్తున్న రేకులను కామారెడ్డిలో అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడైందని తెలిపారు. ఈ మేరకు ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 3 ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాలీ ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

అవినీతి కేసులో మాజీ ఉద్యోగికి నాలుగేళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: విధి నిర్వహణలో లంచం తీసుకుంటూ పట్టుబడిన ప్రభుత్వ ఉద్యోగికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.12 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పి.లక్ష్మీకుమారి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం.. ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామానికి చెందిన వేల్పుల వెంకన్న తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తిని విరాసత్ చేయాల్సిందిగా తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. జమాబంది నిమిత్తం బావుపేట గ్రామానికి చెందిన వీఆర్వో పాంరాజ్ మధుసూదన్‌రావును కలవాల్సిందిగా ఆయన సూచించారు. ఈక్రమంలో పట్టాదార్ పాస్‌బుక్ ఇచ్చిన వీఆర్వోను టైటిల్ డీడ్‌లు ఇవ్వాలని అడుగగా రూ.25,000 లంచం ఇస్తేనే టైటిల్ డీడ్ ఇస్తానని డిమాండ్ చేశాడు. దీంతో వెంకన్న ఏసీబీ అధికారులకు 2010 అక్టోబర్ 9 ఫిర్యాదు చేశాడు. నవంబర్ 1న తహసీల్దార్ ఆఫీసులో వెంకన్న నుంచి వీఆర్వో లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ జైపాల్ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. సీఐ రమణమూర్తి కేసు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కిషోర్ వాదించారు. న్యాయమూర్తి పి.లక్ష్మీకుమారి సాక్ష్యాధారాలు పరిశీలించి మధుసూదన్‌రావుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జైలు శిక్ష పడ్డ మధుసూదన్‌రావు ఉద్యోగ విరమణ పొందాడు.

ఫిర్యాదుదారుకు కోర్టు నోటీసులు

ఈ కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న వెంకన్న కోర్టుకు హాజరై నిందితుడికి అనుకూలంగా సాక్ష్యం ఇవ్వడంతో, 'నీ పై చర్యలు ఎందుకు తీసుకోరాదో కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలి' అని ఏసీబీ కోర్టు నోటీసులు జారీ చేసింది.

తల్వార్ తిప్పిన ఇద్దరిపై కేసు

గోదావరిఖని: రౌడీషీటర్ మంథని సుమన్ శవయాత్రలో తల్వార్ తిప్పిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు రమేష్‌బాబు, ప్రసాద్‌రావు తెలిపారు. పొడవాటి కత్తిని తిప్పుతూ రోడ్లపై వెళ్తున్న ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసిన స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఎండీ జాకీర్, రాంనగర్‌కు చెందిన మారంగుల రమేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. చట్టవ్యతిరేక కార్యకపాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు

చికిత్సపొందుతూ బాలిక మృతి

మంథని: మంథని మండలం పోతారంకు చెందిన వడ్లకొ నిత్య(14) గత నెల 22న పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ 30న రాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నిత్య మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. గత నెల 11 నుంచి 23 వరకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చింది. తిరిగి 23న వసతి గృహానికి వెళ్లాల్సి ఉండగా వెళ్లనని 22న తల్లితో గొడవపడింది. వెళ్లాలని తల్లి మందలించడంతో ఆ విషయాన్ని మనసులో పెట్టుకొని ఇంటి పక్కన గల బాతురూంలోకి వెళ్లి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మంథని ఆస్పత్రి తర్వాత హైదరాబాద్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

సన్మానం


ప్రతిభను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించిన ప్రతిభను మంగళవారం దుమాల గ్రామంలో సర్పంచ్ కదిరె రజిత శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రజిత మాట్లాడుతూ ఈతరం యువత ప్రతిభను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కదిరె భాస్కర్, ఉప సర్పంచ్ హనుమంతు, మాజీ ఎంపీటీసీ శంకర్, కార్యదర్శి మహేందర్, చకినాల నారాయణ, సిరిపురం రాజిరెడ్డి, పొన్నం రాములు, అంజయ్య, బాలయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.